# దేవుని దగ్గరకు వెళ్లిన అమ్మ కోసం

ఉదయాకాశం తొలి వెలుగులతో విచ్చుకుంటున్నది. ఇంకా శాంతారెడ్డి రాలేదు. సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ దగ్గర్లో యాత్రీనివాస్‌కి ఉదయం ఆరు నలభై అయిదుకే చేరుకుందామనుకున్నాం. అక్కడకు ఆమె ఉంటున్న హాలిడే ఇన్, కార్లో పది నిమిషాల దూరం. బస్ ఏడుకు బయల్దేరుతుందన్నారు. ఏడు కావస్తున్నది. బస్ రాలేదు. ఆమె రాలేదు. రాత్రి మేము ముచ్చట్లు చెప్పుకుని ఆమె దగ్గర నుండి బయటపడేసరికి పన్నెండయింది. నిన్న రెండు చిత్రాలు కొనుక్కున్నదామె. ఆ ఇద్దరు చిత్రకారుల్ని రాత్రి భోజనానికి తన హోటల్‌కి ఆహ్వానించింది. ఆ తర్వాత చాలసేపు ముచ్చట్లు.

అంతలో తెల్లఅంబాసిడర్ కార్లో ఓ ముసలాయన, నాలుగయిదేళ్ల పిల్లవాడు దిగారు. కారు వెళ్లిపోయింది. పసుపుపచ్చ చిన్న సూట్‌కేస్‌తో, చేతిసంచితో దిగిన ఆ ముసలాయన నన్ను చూస్తూ నా వేపు వచ్చాడు. ఆయన్ని ఎక్కడో చూసినట్టు మనసు పాతరోజుల్ని వెతకసాగింది. ఆ ముఖంలో మన చుట్టూ ఉండే మనుషుల్లో ఎక్కడా కనిపించని తేజస్సు, ప్రశాంతమైన చూపులు.

నమస్కారం అన్నాను అనుకోకుండానే. నాకే వింత. ఎందుకట్లా చేతులు జోడించానో, తల వంచుకున్నానో ఆ కొత్త మనిషి ముందు. ఎప్పుడూ లేని నా భక్తి నాకే కొత్తగా తోచింది. మహాత్ముడు ఎవరో మారురూపంలో వచ్చినట్టు మనసు భ్రమ. మంచి మనిషి భగవంతుని ప్రతిరూపం అంటారు కదా.

ఉన్ని తొడుగులు నిండా ఉన్నా చలితో వణికిపోతున్నాను.

ఆ ముసలాయన మామూలు ముతకనూలుచొక్కా, ధోతీలతో చలి ఎరగనట్టు కనిపిస్తున్నాడు. పాదాలకి చెప్పులు. ఆవరణలోపలికి వెళ్లి ఓ పక్క నుంచున్నాడాయన. ఆ పిల్లవాడు సూట్‌కేస్ మీద కూర్చున్నాడు. తలకు ఉన్ని టోపి. ముదురు నీలం

రంగు స్వెట్టర్. పాదాలకి షూజ్. గతమూ భవిష్యత్తూ ఒక చోట కలిసినట్టు కనిపిస్తున్నారు ఆ ఇద్దరూ. తాతా మనవళ్లేనేమో.

ఆ పిల్లవాని ముఖంలో దిగులు. తల్లినించో, తండ్రినించో విడదీసి తెచ్చినట్టు తెలుస్తూనే ఉంది. ఎవరి కోసమో బెంగపెట్టుకున్నాడా అనిపిస్తున్నది.

అప్పటికే అక్కడ దాదాపు నలభై మంది వరకు పర్యాటకులు చేరారు. ఆడామగా అంతా. అన్నివయసులవాళ్లు. అన్నిభాషలవాళ్లు. అన్ని ప్రాంతాల వాళ్లు. అన్నివృత్తులవాళ్లు. వేషభాషల్లో ఎంతో వైవిధ్యంతో కళకళ్లాడుతూ, చిన్న చిన్న గుంపులుగా చేరి, తమలో తాము.

అప్పుడు దిగింది శాంతారెడ్డి ఆటోలో. ఆమెకోసం ప్రత్యేకించి ఏర్పాటు చేసినకారు ఉండగా, ఆమె ఆటోలో రావటం విచిత్రమనిపించింది. రాత్రి పన్నెండున్నర ప్రాంతంలో మమ్మల్ని ఇళ్ళదగ్గర విడిచిపెట్టివెళ్లిన డ్రైవర్ సమయానికి రాలేదా?

నేను సూట్‌కేస్ అందుకున్నాను.

అక్కడున్న మనుషులందరూ మా తోటి పర్యాటకులు. ఈ రెండు రోజులూ వాళ్లే మామిత్రులు. నాగార్జునసాగర్‌యాత్ర, కృష్ణానదిలో సాగర్ నుండి శ్రీశైలం వరకు లాంచిలో రానూపోనూ రెండువందలఇరవై కిలోమీటర్ల ప్రయాణం. శ్రీశైలంలో శ్రీభ్రమరాంబికామల్లికార్జునస్వామివారి దర్శనంకోసం ఈ చలిలో వచ్చిన ఆ పర్యాటకులంతా మావాళ్లే అనిపించింది. వాళ్ల దుస్తుల్లో చలికాలం కనిపిస్తున్నది.

అక్కడ చేరిన జట్టులో ఏడెనిమిది యువదంపతుల జట్లు కనిపించాయి.

ఓ తెల్లఉన్నిటోపి, ఉన్నిస్వెట్టర్‌తో ఏడాదిన్నర పిల్లవాడు కిందికి దిగి, దగ్గర్లో తల్లిదండ్రులతో ఉన్న అదే ఈడు పిల్లవాని దగ్గరకు చొరవగా వెళ్లి స్నేహం చేశాడు. ఆ దృశ్యం చూసిన వాళ్లంతా మురిసిపోయి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. ఆ పిల్లవాడు అక్కడితో ఆగక ఇంకోగుంపు వరకు పోయి, తన కన్నా పెద్దగా ఉన్న ఒక పాపతో ఏదో చెప్పి, చేతులు పట్టుకుని రమ్మని పిలుస్తున్నాడు. ఈ దృశ్యం అందరినీ ఆకర్షించింది. ఈ సారి నవ్వు ఆపుకోలేకపోయారు.

'ఈ పిల్లవాడు మన లిటిల్ బుద్ధా' అన్నాడు అక్కడున్న ఏభయ్యేళ్ల కళ్లద్దాల పెద్దాయన. తర్వాత తెలిసింది ఆయన కథా రచయితని.

అప్పుడు గుర్తొచ్చింది. తెల్ల అంబాసిడర్‌లో నాలుగయిదేళ్ల పిల్లవానితో దిగిన ఆ ముసలాయన శంకరపార్వతీశంగారు. మా పెద్దన్నయ్య చదువుతున్న రోజుల్లో ప్రిన్సిపాల్, నేను కాలేజీలో చేరేసరికి ఆయన పదవీ విరమణ చేశారు. ఆయన వయసు కనీసం ఎనభై ఏళ్లుంటాయి. మనిషి ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు.

ఇంతలో ఎర్ర మారుతి వచ్చి ఆగింది. ఇద్దరు పెద్దవయసు దంపతులు దిగారు. అరవై అరవై అయిదేళ్లవాళ్లు. ఆయన గ్రే సూట్‌లో ఉన్నాడు. ఆమె చీర మీద ఖరీదైన ఓవర్‌కోటు వేసుకుంది. ఇద్దరూ కళ్లద్దాల వాళ్లే. విదేశాల్లో చాలా ఏళ్లు ఉండి వచ్చిన వాళ్లలా ఉంది వాళ్ల ధోరణి వాళ్లు పట్టుకున్న సూట్‌కేస్‌కి విమానాల్లో ప్రయాణం చేసిన గుర్తులున్నాయి. వీళ్లు ఇట్లాంటి బస్సుల్లో వెళ్లే మనుషులు కారని తెలుస్తూనే ఉంది.

'రేపు రాత్రి పది గంటలకల్లా ఉండాలి ఇక్కడ' అని డ్రైవర్‌తో తమిళంలో చెప్పాడాయన. డ్రైవర్ వినయంగా నమస్కరించి వెళ్లిపోయాడు.

మా లిటిల్‌బుద్ధా ఆ ముసలమ్మ దగ్గరకు వెళ్లి, ఆమె చెయ్యిపట్టు కున్నాడు. అది చూసినవాళ్లంతా ఫక్కుననవ్వారు. వాళ్ల అమ్మమ్మో, నాన్నమ్మో అనుకున్నట్టుంది. అందుకే వాళ్ల ఆశ్చర్యం, సంతోషం.

అక్కడున్న ముఖాలన్నీ సంతోషంతో విచ్చుకున్నా, శంకర పార్వతీశంగారి చిన్న బాబు ముఖంలో మాత్రం ఏ మార్పూ లేదు.

ఉదయం దాదాపు ఏడున్నర కావస్తున్నది. అయినా మహాఘనత వహించిన రాష్ట్రపర్యాటకశాఖ వారి యాత్రాబస్సు జాడ లేదు. మాకు మల్లే ఆ రిసెప్షన్‌లో ఉన్న ఇద్దరుయువకులు రోడ్డుమీదికివచ్చి, బస్‌కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు.

వివరాలు కనుక్కోవాలని రిసెప్షన్‌కు వెళ్లిన శాంతారెడ్డి తిరిగివస్తూ తన ఈడువాళ్లే అయిన ఇద్దరు పంజాబీ ఇల్లాళ్ల దగ్గర ఆగిపోయి ముచ్చట్లలో పడింది.

అంతలో ఆ తమిళ పెద్దమనిషి నన్ను ఎరిగినట్టుగా నా దగ్గరకు వచ్చి, 'ప్రభుత్వం అంటే ఇట్లా ఉంటుంది' అన్నాడు ఇంగ్లీషులో, తనకు అలవాటైన మంచి ఉచ్చారణతో.

బస్సు ఆలస్యం కావటంతో ముందుగా వచ్చిన వాళ్లకు మరింత విసుగ్గా ఉంది.

అక్కడ చేరిన వాళ్లలో మంగోలియన్ పోలికలున్న దంపతులు ముదురురంగు ఎరుపు, నలుపు అడ్డం చారల ఉన్ని శాలువలు కప్పుకుని ఓ మూల కనిపించారు. మనదేశపు ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, మిజోరమ్, నాగాలాండ్‌లకు చెందిన వాళ్లు అయి ఉండవచ్చు. లేదా చలికాలం ఉన్ని దుస్తులు అమ్ముకోవటానికి వచ్చిన టిబెట్ కాందిశీకులన్నా కావచ్చు. వాళ్లల్లో వాళ్లే మాట్లాడుకుంటున్నారు.

క్రీస్తుశకం రెండుమూడు శతాబ్దాలకు చెందిన ఆచార్య నాగార్జునుడి బౌద్ధ కేంద్రాన్ని చూడబోతున్నందుకు శాంతారెడ్డికి సంతోషంగా ఉంది. ప్రొఫెసర్ కె.సచ్చిదానందమూర్తిగారి పుస్తకం చదవమంది, నాగార్జున సాగర్ రెండుసార్లు చూశాను, కాలేజీ దశలో. కానీ, అది గొప్ప ఆనకట్ట అని మాత్రమే అప్పుడు

చూశాను. ఈ ఆనకట్ట మూలంగా ఏర్పడిన నాగార్జునకొండ దీవి మీద పునః స్థాపించిన బౌద్ధ, హిందూ చారిత్రిక అవశేషాలు — వాటి గొప్పతనం నాకు అప్పట్లో అర్థం కాలేదు. ప్రపంచ మతాలన్నీ మోక్షానికి మార్గం చూపించాయి. బౌద్ధమతం మాత్రం సమాజమోక్షానికి, సుఖదుఃఖాల ప్రమేయంనుంచి మానవజాతిని ఉద్ధరించటానికి కృషి చేసింది. వ్యక్తిలోని శక్తిని సంఘసంక్షేమానికి మళ్లించింది. అహింసా, కారుణ్యాలతో కొత్తపరమసత్యాన్ని అవిష్కరించి మానవ సృజనాత్మకతను బహుముఖంగా వికసింపజేసింది. శాంతారెడ్డి మాటలు త్వరగా అర్థంకాకపోయినా, నాగార్జునుడి గొప్పతనం మాత్రం బోధపడ సాగింది. నాగార్జునుడు, బుద్ధుడంతటి వాడని, బౌద్ధమతబోధనలకు సృజనాత్మకంగా కొత్త అన్వయం చెప్పి, ధర్మచక్రాన్ని ముందుకు నడిపించిన మహాతత్త్వవేత్తగా బౌద్ధప్రపంచం శ్లాఘించిందని మొదటిసారిగా తెలుసుకుంటున్నట్టయింది. తెలుగుదేశంలో జీవించిన ఆచార్య నాగార్జునుడి గురించి తెలుగు జాతికి తెలియకపోవచ్చు. కానీ, చైనా, జపాన్, టిబెట్, కొరియా, మంగోలియా, బర్మా, థాయ్‌లాండ్, వియత్నాం —ఇంకా ఎన్నో దేశాల్లో నాగార్జునుడిని గౌతమబుద్ధుని పరమావతారంగా పూజిస్తారు, ఆరాధిస్తారు. ఇప్పుడు నాగార్జునుడి గురించి మనం తెలుసుకోవడానికి ఆ విదేశీ భాషల్లోని గ్రంథాలే ఆధారమయ్యాయట.

ఆర్కిటెక్ట్ శాంతారెడ్డితో నాతొలి పరిచయం ఢిల్లీ ప్రపంచచలన చిత్రోత్సవంలో. ఆమె అప్పుడు పుణేలో ఉండేది. ఇప్పటికీ ఆమె తల్లీ, తమ్ముళ్లూ అక్కడే ఉన్నారు. తర్వాత ఏడాది మేము తిరువనంతపురం చలన చిత్రోత్సవాల్లో మరోసారి కలుసుకున్నాం. మూడేళ్లయింది ఆమె ఢిల్లీ వచ్చి. తన ప్రాక్టీస్ ఒత్తిడి మూలంగా ఢిల్లీ రావటం తప్పలేదట. ఇప్పుడు తనక్లయింట్ పని మీద హైదరాబాద్ వచ్చింది. ఒక ప్రైవేట్ పారిశ్రామికసంస్థకు సంబంధించిన శిక్షణ, అధ్యయన, పరిశోధనా విషయాల కోసం ఒక భవనసముదాయాన్ని నిర్మించటానికి సంబంధించిన రూపకల్పన పని మీద ఆమె ఇక్కడకు వచ్చింది. ఆమెతో పాటు ఇద్దరు అసిస్టెంట్‌లు కూడా వచ్చారు. నిన్న వాళ్లు తిరిగి ఢిల్లీ వెళ్లి పోయారు. ఈ యాత్ర కోసం నాలుగు రోజుల పాటు ఇక్కడ గడపాలని ఆమె ఉండిపోయింది.

ఆమెను నాకు తొలిసారి పరిచయం చేసిన సుబ్బరామయ్య ఇప్పుడు ఇక్కడే ఉన్నాడు. ఆమె హైదరాబాద్ వచ్చి నాలుగు రోజులుగా ఇక్కడ ఉంటున్న సంగతికూడా సుబ్బరామయ్యకు ఆమె తెలీనివ్వలేదు. శాంతారెడ్డి వచ్చి తనను కలవకుండా వెళ్లిపోయిందని తెలిస్తే అతడు పడే బాధ కన్నా, ఈ వారం రోజులు మేము కలిసి తిరిగామని తెలిస్తే అతడు పడే బాధ ఎక్కువ.

అంతలో ఒకటి వెనక ఒకటి రెండు బస్సులు వచ్చి గేటు దగ్గర ఆగాయి. అంతవరకు తిట్టుకుంటున్న పర్యాటకులు క్షమించేసి, బస్సుల ముందు గుమిగూడారు.

* * *

మా బస్సులు నాగార్జున సాగర్ చేరేసరికి మధ్యాహ్నం పన్నెండయింది. ప్రాజెక్ట్ హౌస్ దగ్గర బస్ ఆగటంతోనే నలభైయేళ్ల స్థానిక టూరిస్ట్ గైడ్ బస్సు లోపలికి వచ్చి మైక్ అందుకుని వచ్చిన పర్యాటక అతిథులకు అభిమానంగా స్వాగతం చెప్పి, అక్కడి కార్యక్రమం గురించి క్లుప్తంగా వివరించి, అర్థగంటలో భోజనానికి డైనింగ్ హాల్‌లో అంతా ఉండాలని కోరాడు. మా గదులు మాకు చూపించారు. పాతకాలపు గదులే అయినా, మధ్యతరగతి స్థాయిలో — ఉన్నంతలో పరిశుభ్రంగా ఉన్నాయి. భోజనం శాకాహారం కావటం, తాజాగా ఉండటం అందరికీ నచ్చింది. అక్కడి ఏర్పాట్లలో సిబ్బంది చూపించిన అప్యాయతను ప్రభుత్వరంగవిరోధి, నా తమిళమిత్రుడు సైతం ప్రశంసిం చకుండా ఉండలేకపోయాడు.

అక్కడ శంకరపార్వతీశంగారు ఆ పిల్లవాడికి స్పూన్‌తోఅన్నం తినిపిస్తున్నారు. ఉదయం హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తినకుండా అల్లరి చేసిన ఆ పిల్లవాడు ఇప్పుడు ఏ అల్లరీ చేయకుండా, తనలో తనే రాజీ పడినట్టుగా అన్నం తింటున్నాడు. మా బాల బుద్ధ తల్లి అన్నం తింటుంటే, ఆమె ఒడిలో కూర్చుని ఆడుకుంటున్నాడు.

ఆ తాతగారు — బహుశా మనుమడే అయిఉండవచ్చు — ఎంతో ప్రేమతో తినపిస్తున్నారు. మేము ఆ బల్ల ముందే కూర్చున్నాం.

'మీ మనవడా?' అడిగాను.

'ముని మనుమడు' అన్నారాయన,

వాళ్లిద్దరే ఈ యాత్రకు రావటం మీద నాకు సందేహం. పిల్లవాడు తల్లీ తండ్రితో కాకుండా తాతగారితో ఉన్నాడంటే —

నా మనసు ఒక్కసారి దుఃఖమయం అయిపోయింది. ఆ వయసులో నా చిన్నతనం, తాత, పెదనాన్నమ్మల అనుబంధం గుర్తొచ్చింది. ఆ వయసుకే అమ్మ చనిపోయింది. ప్రపంచమంతా నాకు శూన్యంగా కనిపించేది. 'అమ్మా' అని పిలిస్తే తాత పలికే వాడు. లేదా పెదనాన్నమ్మ పలికేది. కానీ అమ్మ పలికేది కాదు. కనిపించేది కాదు. ఎంత వెతికినా ఎక్కడా అమ్మ కనిపించలేదు. తాతయ్యని అడిగేవాడిని. పొరుగూరు పెత్తాతగారింటికి వెళ్లిందని చెప్పేవాడు. ఎప్పుడు వస్తుందని అడిగేవాడిని. రేపు వస్తుందని చెప్పేవాడు. రేపు అడిగేవాడిని. ఏడ్చేవాడిని.

రోజూ అడిగేవాడిని. రేపు అనే. రేపు రేపు. ఆ రేపు అంటేనే భయమయిపోయింది. అమ్మ కావాలని ఏడ్చే వాడిని. ప్రపంచం నాకు మొదటిసారిగా చెప్పిన అబద్ధం 'రేపు'. నా కన్నీళ్లు తుడుస్తూ తాతయ్య ఏడ్చేవాడు. నా చిన్ని చేతులు ఆ కన్నీళ్లతో ఆడుకునేవి. అట్లా ఆ దుఃఖం ఎన్నాళ్లు సాగిందో —

ఆ పిల్లవాడి ముఖంలో అట్లాంటి విషాదమేదో దాక్కుని ఉందని నా మనసు శంకిస్తున్నది. అట్లా జరగకూడదని నా మనసు ప్రార్థిస్తున్నది.

దుఃఖాన్ని ప్రపంచంనుండి తొలగించటానికి వచ్చిన బుద్ధుడు సైతం చెరిపేయలేని దుఃఖమది —

మరో ప్రశ్న అడగటానికి నాకు ధైర్యం చాల్లేదు. మెల్లగా తెలుస్తుంది. ఆ పిల్లవాడు మాటాడితే బాగుండును. మాటాడటం లేదు.

మా బస్ పైలాన్ దగ్గర ఆగింది.

కొత్త లోకంలో అడుగుపెట్టామన్న సంతోషం. మేము వస్తున్నప్పుడే — గమ్యం ఇంకా పది కిలోమీటర్లు దూరం ఉండగానే, సాగర్ జలాలు కొండల మధ్య వంపులు తిరుగుతూ నీలంగా కనుచూపుమేర కనిపించసాగాయి.

ఇదే మన తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన ఆధునిక దేవాలయం. మానవసేవయే మాధవసేవ అన్న వివేకానందుని గుర్తుచేసే దేవాలయం. నదులనూ, సరస్సులనూ, సముద్రాలనూ పూజించటం భారతీయుల సంప్రదాయమే కాబట్టి ఆ రకంగా కూడా అది దేవాలయమే.

మా దర్శకుడు డామ్ ఎత్తూ పొడవూ, సరస్సు విస్తీర్ణం, పండే పంటలు, సాగుచేస్తున్న లక్షలాదిఎకరాల భూములు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి గురించి గణాంకవివరాలు చెపుతున్నాడు.

'ఈ ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన డిసెంబర్ పదో తేదీన ఏటా జాతి పండుగ చేసుకోవద్దా?' అంటున్నాడు నా తమిళ మిత్రుడు. 'దేశాన్ని అన్నపూర్ణను చేసిన ఆ తేదీ పండుగే కదా?' అన్నాడు మళ్లీ. కొంతమంది చాలా కుతూహలంగా గైడ్ చెప్తున్న వివరాలు వింటున్నారు.

'ముందు మమ్మల్ని ఆ నాగార్జునకొండ మీద విడిచి పెట్టకూడదా' అంటున్నది శాంతారెడ్డి.

నూటపదిఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ మహాక్షేత్రం అందమంతా చుట్టూరా మునిగితేలే కొండలు. తెరలు తెరలుగా. వాటిని తప్పించుకుని ముందుకు పోతున్నకొద్దీ సరస్సు సాగుతూనే ఉంటుంది, ముదురాకుపచ్చ జలాలతో.

అప్పుడు గుర్తొచ్చారు, ఆ తాతగారూ, పిల్లవాడూ. ఏమయిపోయారో, బస్సులో

లేరు. మా బాలబుద్ధుడు మాత్రం తండ్రి భుజం మీద నిద్రపోతున్నాడు.

ప్రపంచంలో చాలా ఆనకట్టలున్నాయి. కానీ, నాగార్జునుడున్న పవిత్ర పుణ్యక్షేత్రం ఇది. బుద్ధభగవానుని అవశేషమున్న మహాచైత్యంతో వెలసిన మహాక్షేత్రం ఇది. ఆ కీర్తి ప్రపంచంలో ఈ ఒక్కచోటనే ఉంది.

డామ్ దక్షిణంవైపు లాంచి బయల్దేరే రేవు దగ్గరకు రెండు గంటలకే మేము చేరుకున్నా, మూడు గంటల వరకు లాంచీ కదల్లేదు. సిబ్బంది హడావిడి చూస్తే ఏదో చెడినట్టు తెలుస్తూనే ఉంది. ఈ ఝరియా లాంచీలోనే రేపు రెండు వందల ఇరవై కిలోమీటర్లు కృష్ణానదిలో రానూపోనూ మా ప్రయాణం! చూస్తే అది చాల పాతకాలపు డొక్కు లాంచిలా కనిపిస్తున్నదే తప్ప అందంగా, అధునాతనంగా పర్యాటకశాఖ వారి పబ్లిసిటీలో కనిపించినట్టుగా లేదు. శాంతారెడ్డి తన కెమేరాతో పైకి పోయింది. నేనూ పోవాలనుకుంటుండగా నా తమిళమిత్రుడు నన్ను పట్టుకున్నాడు.

'ప్రభుత్వం అంటే ఇటాగే ఉంటుంది. ఈ లాంచి చూడండి ఎట్లా ఉందో. సీట్లకి ఉన్న స్పాంజ్ మెత్తలన్నీ పాడయినట్టున్నాయి. తీసేశారు. అవి పెట్టించే దిక్కు లేదు.'

నేనే జవాబుదారినన్నట్టుగా నన్ను అడుగుతున్నాడు ఆయన.

'మీరు విదేశాల్లో చాల ఏళ్ల పాటు ఉండి వచ్చినట్టున్నారు' అన్నాను. ఈ దేశంలో ఉన్నవాళ్లకు ఇవేవీ సమస్యలు కావు, కొత్తా కావు. ఆయనకే అంతా కొత్తగా ఉంది.

'ఈ మట్టిమీద చచ్చిపోవాలని వచ్చేశాను, మాతృదేశం. కానీ, ఇప్పుడిప్పుడే చావను. నా మాతృదేశానికి నేను చాల రుణపడి ఉన్నాను. ఆ రుణం తీర్చుకోవాలి' అన్నాడు.

ఇట్లా వచ్చిన వాళ్లెందరో సంవత్సరం తిరగకముందే ఇక్కడి పరిస్థితులకు తట్టుకోలేకతిరిగి భయపడి దేశాన్ని విడిచిపెట్టి పారిపోయారు అని మనసులో అనుకున్నాను. ఆయన మాటల ధోరణికి ఆయన సతీమణి నవ్వుతున్నది.

నేను లాంచి ఇంజిన్ కేబిన్‌లోంచి పైకి వెళ్లాను. అప్పటికే కుర్రవాళ్లు, ఆడపిల్లలు చాలమంది పైకి వచ్చి కెమేరాలతో సిద్ధంగా ఉన్నారు. శాంతారెడ్డి రేవులో గాలంవేసి చేపలుపట్టుకుంటున్న యువకుని ఫోటో తీస్తున్నది.దూరంగా పెద్ద బుట్టల్లాంటి రెండుడింగీలు తెడ్డువేసుకుంటూ మా వేపు వస్తున్నాయి.

'ఎంత బావున్నాయో ఈ నీళ్లు, స్వచ్ఛంగా' పొగుడుతున్నది. ప్రపంచంలో ఎప్పుడూ నీళ్లే చూడనట్టు ఆశ్చర్యపోతున్నది. అంతఅందం ఆ జలాల్లో ఏముందో నాకు కనిపించలేదు. నా మౌనం చూసి, 'అందం ఎక్కడుందో తెలుసా?'

అడిగిందామె తర్వాత.

నేను మాట్లాడలేదు. మరొకరైతే నీలో అనేవాడినేమో అట్లాంటి ప్రశ్నకు. శాంతారెడ్డి దగ్గర అట్లా మాట్లాడలేకపోయాను. నాకు అక్కడున్న అందాలకన్నా అపురూపమైన అందంగా ఆమె కనిపిస్తున్నది.

ఆమె తన్మయానందంతో సాగరానికి చుట్టూ గోడల్లా ఉన్న ఆకుపచ్చటి అరణ్యాలతో కొండల వరసలని, ఆ మధ్య విస్తరించిన తల్లి కృష్ణవేణమ్మ సోయగాలనీ చూస్తూ నా వేపు తిరిగి, 'మన సంస్కారంలో' అంది.

'అందానికి మనసు ప్రకంపించాలి. ప్రకృతి ప్రసారం చేసే సంకేతాలు కవిత్వమై, కళలై, సంగీతమై హృదయం పలకాలి' అంటున్నదామె.

మా లాంచి ఎట్టకేలకు ఘీంకరించింది. కదిలింది. పరుగు సాగించింది. కళాశాల విద్యార్థినులజట్టు గొంతులు కలిపి పాట ఎత్తుకున్నారు.

'పడవ సాగిందోయ్ బావా, పడవ సాగింది.'

ఆ ఒక్కచరణం మాత్రమే గొంతుకలిపిపాడి, నవ్వేసి మరో పాట అందుకున్నారు.

ఆమె చెప్పిన అందానికి అది ప్రతిస్పందన — ఆ పిల్లల్లో, పరిశుద్ధంగా ఉన్న వాళ్ల హృదయాల్లో గిలిగింతలు పెట్టినట్టుంది ప్రకృతి.

ఆమెతో ఢిల్లీ సిరిఫోర్ట్ ఆడిటోరియంలో తొలి పరిచయం. జీన్స్‌లో ఉంది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లోని తనస్నేహితులతో కలిసి వచ్చిందట. చాలా చిన్న వయసు అనిపించింది నాకు. అప్పటికే ఆమె అమెరికాలో ఎమ్.ఎస్ చేసి, ఓ జపాన్ సంస్థలో అక్కడే మూడేళ్లు పనిచేసి వచ్చినంత వయసు కనిపించ లేదు. ఆమెముఖంలో కనిపించేది శారీరకమైన అందం కాదు. మంచితనం, అభిమానం. మంచి ఎత్తు, మగగొంతు. సంప్రదాయికమైన ఆడపిల్లల లక్షణాలు ఏమీ కనిపించవు. మా అభిప్రాయాలు కలిశాయి. పత్రికా రచయితలంటే ఆమెకి గౌరవమట. అది నా పట్ల యోగ్యత అయింది. సిరిఫోర్ట్‌కి నడకదూరంలో పంచశీలా పార్క్‌లో ఆమె ఉంటున్నది. స్నేహితుల ఇంట్లో ఆమె అతిథి. నేను మునిర్కా డి.డి.ఎ అపార్ట్‌మెంట్స్‌లో ఓ స్నేహితుని దగ్గర ఉంటున్నాను. రాత్రుళ్లు చివరి సినిమా ముగిసేసరికి పన్నెండు దాటేది. ఆమెని పంచశీలాపార్క్‌లో విడిచిపెట్టి నేను వెళ్లేవాడిని. ఉదయం వచ్చేటప్పుడు ఆమె దగ్గరకు వెళ్లి, అదే ఆటోలో వచ్చేవాళ్లం. ఆ రెండో ఏడాది త్రివేండ్రం చలన చిత్రోత్సవాల్లో కూడా మా ఇద్దరికీ ఒకే హోటల్‌లో గదులు దొరికాయి. ఎప్పుడో ఒకప్పుడు ఓ మంచిసినిమా తియ్యాలని ఆమె కోరిక. దర్శకత్వం ఆమెకి ఇష్టం.

ఆ త్రివేంద్రం రోజుల్లోనే ఓ ప్రశ్న అడిగాను శాంతారెడ్డిని. పెళ్లి వయసు దాటిపోతున్నదికదా, పెళ్లెందుకు చేసుకోలేదని.

'జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను' అందామె. 'ఎందుకు'? అడిగాను. 'పెళ్లీ, కుటుంబమూ నాకు పడవు. ఆ హద్దుల్లో ఇమడలేను' అందామె.

జీవితంలో ఏదో పెద్ద ఎదురు దెబ్బ తగిలిన తర్వాత తీసుకున్న నిర్ణయంలా ఉంది. ఆమె కూడా దెబ్బతిన్న గుర్రమే అనిపించింది. నేను ఒంటరిగా ఉండిపోవటానికి అదే కారణం. అయితే, పెళ్లి చేసుకోను అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు నేను.

అప్పటి నించి ఏటా ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు పంపిస్తున్నాను. ఆమె నాకు కొత్తసంవత్సరం శుభాకాంక్షలు పంపిస్తున్నది. నాన్నగారు చనిపోయారు. పెద్దన్నయ్య సంసారాన్ని పట్టించుకోలేదు. కలకత్తాలో ఉంటున్నాడు. పిన్ని ఆరోగ్యం బావుండ లేదు. చెల్లెళ్ల పెళ్లిళ్లు. ఆ పెళ్లిళ్లకు ఆమెని ఆహ్వానించాను. ఆమె రాలేకపోయింది.

లాంచి ఒడ్డుకు చేరుతున్నది. ఈ కొండమీద పచ్చనిచెట్లు కనిపిస్తున్నాయి.

నాగార్జునకొండ మీద మా అడుగులు పడ్డాయో లేదో శరీరం అంతటా పులకింత మొదలయింది. ఆనాటి బౌద్ధారామంలో ప్రవేశించినట్టుంది.

శాంతారెడ్డి ఆ మట్టిని చేత్తో తాకి కళ్లకద్దుకుంది.

మేమంతా పైకి వెళ్లేసరికి మా పర్యాటక దర్శకుడు, వచ్చినవాళ్లనందరినీ ఒకచోట చేర్చి, వారి ముందు నుంచుని మైక్ పట్టుకుని గొంతు సవరించు కుంటున్నాడు.

ఆ మంగోలియన్‌జంటమాత్రం అక్కడ ఆగకుండా లోపలికి వెళ్లి పోతున్నారు. మాతోపాటు వచ్చినవాళ్లల్లో వృద్ధులు వెనకపడ్డారు. వాళ్లు వచ్చే వరకు ఆగి గొంతు విప్పాడాయన.

'మహాపవిత్రమైన శ్రీపర్వతం మీద మనం ఇప్పుడున్నాం.

ఇక్కడే కృష్ణానదీ లోయలో వెలసిన ఇక్ష్వాకు వంశరాజులచరిత్రకూ, బుద్ధభగవానుని అపరావతారంగా ప్రపంచంలో సగం జనం భావించే ఆచార్య నాగార్జునుడు నిర్మించిన బౌద్ధ మత క్షేత్రానికీ ఈ శ్రీపర్వతం సాక్షీభూతంగా నిలిచి ఉంది.'

ఇంగ్లీషులో చెపుతున్నాడాయన. అంతా నిశ్శబ్దంగా వింటున్నారు.

మాతోపాటే లాంచీలో వచ్చిన పాఠశాల, కళాశాలల ఆడపిల్లలు రెక్కలొచ్చిన పక్షుల్లా లోపలికి పరుగెత్తారు. వాళ్లవెంట వాళ్లను తీసుకొచ్చిన టీచర్లు

పరుగెత్తసాగారు. కొండమీద అప్పటికే కొన్నివందలమంది పర్యాటకులు, వాళ్లల్లో ఎక్కువమంది విద్యార్థులే చేరారు. చూడటం ముగించిన వాళ్లు తిరిగి రేవువేపు వస్తున్నారు. చాల సందడిగా ఉంది. బౌద్ధాలయంలో గంటలు మార్మోగుతున్నట్టు సంగీతప్రాయమైన కోలాహలం.

తొలిసారిగా 1926 మార్చి నెలలో అప్పటి పురావస్తుశాఖలో తెలుగు అసిస్టెంట్‌గా ఉన్న ఎ.ఆర్. సరస్వతి అనే ఉద్యోగి ఈ శిథిలాలను కనిపెట్టారు. 1927— 31 మధ్యలో ఎ.హెచ్. లాంగ్‌హర్స్ట్ సారథ్యంలో ఇక్కడ తవ్వకాలు కొనసాగాయి. దాంతో మహత్తరమైన బౌద్ధ స్థూపాలూ, చైత్యాలూ, ఆరామాలూ, విహారాలూ, నాగార్జునుడికాలంనాటి విశ్వవిద్యాలయం శిథిలాల్లోంచి బైట పడ్డాయి. బుద్ధభగవానుని శారీరకఅవశేషాలు రెండు ఇక్కడి మహాచైత్యంలో లభించాయి. అవి బుద్ధభగవానుడివే అని రుజువు చేసిన రాతలు బ్రాహ్మీలిపిలో సాక్ష్యాధారాలుగా నిలిచాయి.

ఈ ఘనతమూలంగానే ఈ శ్రీ పర్వతం ప్రపంచంలో అతి పవిత్రమైన బౌద్ధక్షేత్రాల్లో ఒకటయింది.

ఈ కొండ విస్తీర్ణం నూటపది ఎకరాలు మాత్రమే. నాగార్జునసాగర్ డామ్ నిర్మాణంమూలంగా సాగరం ఏర్పడటంతో మానవనిర్మితమైన ఈ సుందర ద్వీపం ఏర్పడింది.

శాతవాహనరాజ్యం శిథిలావస్థలో ఉన్న దశలో క్రీస్తుశకం మూడోశతాబ్దం మొదటిఅర్థభాగంలో వాశిష్ఠీపుత్రచాంతమూల ఈ నదీ లోయలో ఇక్ష్వాకు వంశం పేరుతో రాజ్యాన్ని స్థాపించాడు. తన విజయానికి గుర్తుగా విజయపురి పేరుతో రాజధానిని నిర్మించాడు. తర్వాత మాధవీపుత్ర వీరపురుషదత్త, వాశిష్ఠీపుత్ర ఎహువల చాంతమూల, వాశిష్ఠీపుత్ర రుద్రపురుషదత్త — ఇక్ష్వాకు వంశంలోని ఈ నలుగురు రాజులు దాదాపు వందఏళ్లు పరిపాలించారు.

మొదటి రాజు చాంతమూల ప్రధానంగా హిందూ మతాభిమాని. ఆయన ఆరాధ్యదైవం కార్తికేయుడు. అయితే, ఆయన సోదరి చాంతశ్రీ బౌద్ధమతాన్ని ప్రోత్సహించింది. నాగార్జునకొండలోయలో మొట్టమొదట నెలకొల్పిన మహాచైత్యం, స్థూపరహిత చైత్యం ఆమె ప్రోత్సాహంతో నిర్మించినవే.'

దాదాపు పదినిమిషాలసేపు అనాటి చరిత్ర, సంస్కృతి, మత వికాసాల గురించి ఆయన క్లుప్తంగా చెప్పాడు.

'ఆ ప్రదేశాలు చూపించి అక్కడే ఈ వివరాలు చెప్పకూడదా!' అన్నాడు మాతో వచ్చిన పంజాబీ యువకుడు.

'మనకు ఇక్కడ నలభైఅయిదు నిమిషాలు మాత్రమే సమయం. వెంటనే చూసి త్వరగా రావాలి. ఆఖరు లాంచి ఇదే.'

మమ్మల్ని వెంటపెట్టుకుని మ్యూజియమ్‌కి తీసుకుపోయాడు.

అక్కడే నదీ లోయలో లభించిన పదమూడడుగుల ఎత్తు బుద్ధభగవానుని పాలరాతి విగ్రహం భద్రపరచారు. బౌద్ధగాథలను చిత్రించిన శిల్పాలు, స్తంభాలు, విగ్రహాలు — వాటి చరిత్ర చెప్పుకుంటూ చూపించే సరికి అక్కడే అర్ధగంటకు పైగా గడచిపోయింది.

మేము లోపల మ్యూజియమ్‌లోని విశేషాలే చూస్తున్నాం. అంతా బైటపడ్డారు. మేము బైటికి వచ్చేసరికి వాళ్లంతా తిరిగి రేవు వైపు నడుస్తున్నారు.

మ్యూజియం దగ్గర పని చేస్తున్న ఓ పెద్దవయసు తోటమాలి 'లాంచి వెళ్లిపోతుంది, ఇదే ఆఖరిది, త్వరగా వెళ్లండి' అని మమ్మల్ని కేకేసి పిలిచి చెప్పాడు.

వాళ్లు మాకు బాగా దూరమయ్యారు. పిలిస్తే వినిపించేట్టు లేదు.

నాగార్జునకొండమీద చూడాల్సింది ఈ మ్యూజియమేనా? నదీ లోయలోంచి వెలికితీసి కొండ మీద పునర్నిర్మించిన అపురూపమైన బౌద్ధ కట్టడాల అవశేషాలు ఏవీ? మహాపవిత్రక్షేత్రం అనుకుంటున్న బుద్ధ భగవానుని దంతమున్న స్వర్ణపేటిక దొరికిన మహాచైత్యం ఏదీ? అష్టాంతర్భాగ మహా స్థూపం, చైత్యగృహం, ఇక్ష్వాకువంశరాణుల స్నానవాటిక, అశ్వమేధశాల, ఇతర విహారాలు ఏవీ? ఎన్ని చారిత్రక అద్భుతాలు, ఎన్ని అందాలు, ఎన్ని వాస్తు శిల్ప విశేషాలు? — ఇవేవీ చూపకుండా, ఆఖరి లాంచీ పోతుందని తిరుగు ముఖం పట్టిన జనం దగ్గరకు పరుగెత్తాను.

'ఇదేమిటీ? ఆ మహాచైత్యమూ, ఆ స్థూపాలూ...'

'లాంచీ వెళ్లిపోతుంది. ఈ వేళ కుదరదు. మీకు సోమవారం చూపిస్తాను.'

'అది కాదు. ఆ మహాచైత్యాన్ని చూడకుండా ఎట్లా తిరిగి వెళ్లాలి? సోమవారం మేము ఇక్కడ ఉండటం లేదు.'

అంతా కొండ దిగిపోతున్నారు. లాంచీ లోపలికి పోతున్నారు. నలుగురయిదుగురు పెద్ద వయసువాళ్లు తప్ప అంతా రేవులో చేరిపోయారు. ఆ మంగోలియన్ యువదంపతులు మహాచైత్యం దగ్గరపూజచేసి వస్తున్నట్టున్నారు. వాళ్లకు పాత అనుభవం ఉన్నట్టే ఉంది. వచ్చీ రావటంతోనే వాళ్లు అటు వైపు వెళ్లిపోయారు.

వేరే రాష్ట్రాల నించి వచ్చిన పర్యాటకులకు దేశసాంస్కృతిక, చారిత్రక మహౌన్నత్యాన్ని చూపే అద్భుతాలు ఏమీ చూపించకుండా ఇదేమి పర్యటన. నేను

ఆశ్చర్యపోతున్నాను. శాంతారెడ్డికి నిజం చెబితే తట్టుకోలేదు. పోట్లాట పెట్టుకుంటుంది. గొడవయ్యేట్టుంది. అతడిదీ నిస్సహాయ పరిస్థితే. వ్యవధి లేదు. ఇంకా చూపాల్సినవి చాలా ఉన్నాయి.

నా పరుగు శాంతారెడ్డికి అర్థం కాలేదు. ఏమిటేమిటి? అంటున్నది.

'ఆఖరు లాంచీ పోతున్నదట. మహాచైత్యం, స్థూపగృహం, ఇతర బౌద్ధ కట్టడాల పునర్నిర్మాణాలు మనం చూడకుండానే పోతున్నాం.'

ఆమె స్వప్నాలన్నీ కుప్పకూలిపోయాయి.

తప్పదు, ఇంకో దారి లేదు. .మరోరోజు రావల్సిందే.

ఈ సంగతి ఇతర పర్యాటకులకు తెలిస్తే —

అంతలో మా టూరిస్టు గైడ్ మా వేపు పరుగెత్తుకుని వచ్చాడు.

ఆ మ్యూజియం సిబ్బందిలో ఒకాయన్ని మాకు తోడు ఇచ్చి, 'క్షమించండి, ఈయనతో వెళ్లండి. త్వరగా ఓ గంటలో వచ్చేయండి. మీరు వేరే లాంచిలో వస్తారు. అనువు దగ్గర మిమ్మల్ని కలుసుకుంటాం. ఈయనతో వెళ్లండి' అని కొత్త ఏర్పాటు చేశాడాయన.

మహాచైత్యదర్శనం చేసుకోకుండా, ఇతర కట్టడాలు చూడకుండా వెళ్లటం మహాపరాధంలా ఉన్న మాకు సంతోషమయింది. త్వరత్వరగా నడిచే ఆ నడివయసు కొత్తమనిషి వెంట నడిచాం. మాకూ పరుగే అయింది. పధ్నాలుగో శతాబ్దపు కొండవీటిరాజుల రాతికోట ద్వారంలోంచి నడిచి, ఎత్తయిన ఆ కోటగోడలను చూసుకుంటూ సాగాం.

పదిహేను నిమిషాల దారి.

నదీ లోయలోంచి వెలికితీసి పునర్నిర్మించిన స్థూపాలు, చైత్యాలు, అశ్వమేధశాల, చాంతశ్రీ నిర్మిత స్థూపరహిత చైత్యగృహం, వైష్ణవ దేవాలయం.

నిజానికి ఇక్కడే మాకు ఆ గైడ్ అవసరం. ఎన్నో విశేషాలు ఇక్కడే మాకు తెలియాలి. అవేవీ అర్థం కాలేదు.

ఆ మహాచైత్యం దగ్గర శాంతారెడ్డి సాష్టాంగ ప్రణామం చేసింది. నేను ఆమెను చూసి అనుకరించాను. ఆమె అక్కడి మట్టి సేకరించింది, ఓ చిన్న కాగితంలో.

అన్నీ, ఏ ఒక్కటీ విడిచి పెట్టకుండా చూసి చివరికి స్నానఘట్టాల దగ్గరకు వచ్చాం.

కొంతనయం అనిపించింది. పర్యాటకశాఖమీద మాత్రం శాంతారెడ్డి మండిపడుతున్నది. దాదాపు ఒక పూటంతా చూడాల్సిన ఈ అపురూపమైన కట్టడాలు నలభై అయిదు నిమిషాల్లో చూడమనటం ఘోరం. బస్సు ఆలస్యంగా బయల్దేరటం,

సిటీలోనే బ్రేక్‌ఫాస్ట్ అని ఆపటం — వాటిని పొదుపు చేస్తే ఇంకో గంట సమయం దొరికేది. లేదా ముందే తెలియజెయ్యాలి — నాగార్జునకొండ మీద విశేషాలు క్షుణ్ణంగా చూడాలనుకున్న వాళ్లు ఓ రోజు ప్రత్యేకంగా అక్కడ ఉండి పోవాల్సి ఉంటుందని. ఈ హెచ్చరిక చాలాఅవసరం అనిపించింది.

* * *

'ఇట్లాంటి చోట, మన పురాణాల్లో చెప్పినట్టు, స్నానాలు చేయటానికి రాకుండా ఉంటారా దేవతలు?'

కృష్ణానదిలో శ్రీశైలానికి లాంచిప్రయాణం మూడున్నరగంటలు. ఉదయం పదిన్నరకు అక్కడకు చేరుకుంటాం. మన లాంచీ ఆగే లింగాలగట్టు దగ్గర మనకోసం బస్సులు ఆగిఉంటాయి. వాటిలో శ్రీశైలభ్రమరాంబికా మల్లికార్జున స్వామివారి ఆలయానికి చేరుకుంటాం. అక్కడ పూజలు జరిగిన తర్వాత సాక్షిగణపతి, ఆదిశంకరుడు తపస్సు చేసిన పాలధార, పంచధార, శిఖరేశ్వరం చూసి తిరిగి మూడు గంటలకల్లా లింగాల గట్టుకు చేరుకుంటాం. తిరుగు ప్రయాణం కృష్ణానదిలో లాంచిలో మూడున్నర గంటలు, సాయత్రం అరున్నర, ఏడుకల్లా నాగార్జున సాగర్ చేరుకుని, వెంటనే అక్కడనుండి బస్సులో హైదరాబాద్ తిరుగు ప్రయాణం.

రెండో రోజు కార్యక్రమం చూసి శాంతారెడ్డి 'మనం శ్రీశైలంలో ఆగి ప్రయాణం రేపటికి మార్చుకుంటే?' అంది. శ్రీశైలం, పర్వతం మీద ఆ ప్రకృతి అందాలను చూట్టానికన్నా ఓ రోజు ఉండాలని ఉందామెకి.

లాంచి కృష్ణాజలాల్లో పరుగు తీస్తున్నది.

లాంచిలోని పర్యాటకులంతా స్వప్నలోకాల్లో తేలిపోతున్నట్టున్నారు. బైనాక్యులర్స్ తీసేవాళ్లు, కెమేరాలతో ఫోటోలు తీసుకునేవాళ్లు సంబరపడి పోతున్నారు. ఈ ప్రకృతి అందాలను చూట్టానికి రెండుకళ్లూ సరిపోవు. ఇట్లాంటి చోట జీవితాంతం ఉండిపోవాలనిపిస్తుంది.

అడవులు అన్నారుగానీ, నల్లమల కొండల మీద ముళ్లతుప్పలు, గడ్డి తప్పించి ఎక్కడా అడవులు కనిపించలేదు. మొదట్లో అవి కొండలు కూడా కావనిపించింది. గుట్టలు మాత్రమే. అట్లా నలభై కిలోమీటర్లు లోపలికి పోయిన తర్వాత కొండలు మొదలవుతాయి. అక్కడే అడవులు కనిపిస్తాయి.

ఈ కొండల్లో అంతస్తులుగా రాతి గోడలు. కిన్నెర, కింపురుష, యక్ష, గంధర్వులందరూ, మూడు కోట్ల దేవతలు వచ్చి ఈ కొండల మీద వరసలు వరసలుగా నుంచుని కృష్ణవేణమ్మ అందాలను చూస్తూ శిలలై పోయారేమో

అనిపిస్తుంది. ఆ రాతి నిర్మాణాలు, ఆ రంగులు, ఆ ఆకారాలు ప్రకృతి చెక్కిన దేవతా శిల్పాల్లా గోచరిస్తాయి.

ఆ తన్మయానందంలో ఉండగా, దాదాపు డెబ్బయ్ కిలోమీటర్ల దారి దాటాక మా లాంచి ఆగిపోయింది. ఆగిపోయేటప్పుడు బాగా ఊగింది. ఇంకొంచెం సేపు అట్లాగే ఊగితే ఎటో ఓ వేపు మునిగిపోతుందేమో అనిపించింది. అయితే, లాంచి సిబ్బంది 'ఎటూ కదలొద్దు. అట్లా ఉండండి. నుంచున్న వాళ్లంతా కూర్చోండి' అని హెచ్చరించారు. నిర్జనారణ్యంలో లాంచి ఆగడం మాకు సంతోషంగానే ఉంది. మెల్లగా లాంచిని ఒడ్డుకు తీసుకువెళ్లారు. ఒడ్డున ఉన్న కొండరాళ్లకు తాళ్లతో కట్టారు. పర్యాటకులంతా ఒడ్డుకు చేరారు. 'పులులున్న అడవులు. లోపలికి పోవద్దు. ఒడ్డునే ఉండండి' అని హెచ్చరిక చేశారు.

అయినా, వింటారా? కెమేరాలకు మంచిదృశ్యాలు దొరికాయి. అడవీ, కొండలూ, నదీ, ఆకాశమూ ఒక చోట కలిసినట్టున్న ప్రకృతి. కొండ అంచున నుంచుని చూస్తున్న శిలారూపంలోని కోట్లాది దేవతలు.

అక్కడ మళ్లీ కనిపించారు శంకర పార్వతీశంగారు. ఆ పిల్లవాడి ముఖం మీద ఇంకా దిగులే .

ఇప్పుడు నాకు చాలా స్పష్టం. ఆ పిల్లవాడికి మాతృ వియోగం కలిగింది. అమ్మ గురించి అడుగ ాడు. ఊరికి వెళ్లిందనే చెబుతారు. రేపు వస్తుందనే చెబుతారు.

కొన్నాళ్లకి ఎవరో చెబుతారు చచ్చిపోయిందని. అంటే —

నేను తాతని అడిగాను, చచ్చిపోయిందంటే ఏమిటని, ఆ చిన్న వయసులో, చాలా రేపుల తర్వాత. చాలా చాలా రేపులు ఎదురు చూసిన తర్వాత.

'దేవుడి దగ్గరకు వెళ్లిపోయింది అమ్మ' అన్నాను తాత.

'ఎప్పుడొస్తుంది?'

'వస్తుంది.'

'దేముడి దగ్గరకు తీసుకుపో' ఏడుపు.

ఇక్కడ ఆ పిల్లవాడి ముఖంలో ఉన్న దుఃఖం అదే, అదే. సందేహం లేదు.

ఇన్ని ప్రకృతి అందాలూ తల్లి చూపులకి, తల్లి పిలుపులకి సరికావు. తల్లి అందం ముందు ఇవన్నీ దిగదుడుపే. అందుకే అదే దిగుల్లో మునిగి ఉన్నాడు.

మా పడవ సాగింది. దేవతలు కొండల మీంచి చూస్తుంటే మా ఝరియా గర్వంగా సాగిపోతున్నది. ఇట్లా ఎంత దూరమన్నా పోవచ్చు. ఆ సాగరమే ఇక్కడ వరకు సాగి వచ్చినట్టు ఉంది. కృష్ణవేణికి ఇక్కడ పరుగులేదు. దేవాలయం కట్టి దేవుణ్ణి ప్రతిష్ఠించినట్టు కృష్ణవేణిని ఇక్కడ ఈ కొండల మధ్య, అడవుల మధ్య

బంధించారు, కోట్లాది ప్రజల ఆకలితీర్చటంకోసం. కృష్ణవేణి ఇప్పుడు లోయలో ప్రవహించే నది కాదు, సాగరం. కొండల మధ్య వ్యాపించిన శాశ్వత సౌందర్యసాగరం. ఎత్తయిన పర్వతాలు. చిక్కని అడవులు. వాటి మధ్య చిక్కిన కృష్ణ చుట్టూ ఆ పచ్చని పర్వాతాలే మాకు దేవుళ్లు.

మరోసారి చెడింది మా లాంచి. అయితే, లాంచి చెడిందన్న బాధ లేదు. సంతోషంగా ఉంది. ప్రకృతితో, ఆ అందాలతో మాకు అనుబంధం ఏర్పడింది.

ఆ సొగసులు మా హృదయాల్లోకి చేరి మమ్మల్ని శుద్ధిచేస్తున్నట్టున్నాయి. డింగీలలో ఆ ఒడ్డున ఉన్న చేపలు పట్టే పిల్లలు వచ్చారు. వాళ్లు సహాయ పడ్డారు. లాంచి తాళ్లు తీసుకుని ఒడ్డునున్న కొండరాళ్లకేసి కట్టారు. లాంచి చుట్టూ వాళ్లు డింగీలతో తిరుగుతున్నారు.

శాంతారెడ్డికి ఇప్పుడు ఆ పిల్లవాడి మీద దృష్టి పడింది. ఆమె వాడి ఫోటోలు తీస్తున్నది. ఆమెకు ఆ పిల్లవాడి దిగులూ, దుఃఖమూ ఏమిటో తెలీదు. అది చెప్పాను. అవునా అని ఆశ్చర్యపోయింది. ఆమెలో మాతృ ప్రతిస్పందన తొలిసారిగా.

ఉదయం పదిన్నర గంటలకు శ్రీశైలం లింగాలగట్టుకు చేరుకుంటామనుకున్న మేము చివరకు మధ్యాహ్నం ఒంటి గంటన్నరకు చేరుకున్నాం. ప్రకృతి అపురూప సౌందర్యాలమధ్య అదనంగా మూడుగంటలసేపు, ఆ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వాముల వారిని పూజ చేస్తున్నట్టుగానే గడచింది. దేవాలయంలో లింగాకారంలోని దేవుడికన్నా పర్వత రూపంలో ఉన్న శివుడినే కొలిచినట్టయింది. అది మాకు లాంచి మరమ్మతు పేర జరిగిన మేలు. శ్రీశైలంలో కృష్ణవేణిని పాతాళగంగ అంటారట. దేవాలయంలో దర్శన సమయం మించిపోయినా, ప్రభుత్వ పర్యాటకులం కావటంతో అక్కడి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ తగ్గటంతో, దేశంలో రెండో జ్యోతిర్లింగమైన మల్లికార్జున స్వామి దర్శనం మనసుతీరా జరిగేట్టు ఉంది. ఎక్కడా ఆగకుండా ముందుకు పోతున్నాం. దేవాలయంలో అడుగు పెట్టేసరికి మధ్యాహ్నం రెండయింది.

'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అంటున్నాడు నా తమిళ మిత్రుడు. దేవాలయ గర్భ ప్రవేశం దగ్గర ఆగిపోయాం.

'చూడు చూడు. దేవతలూ, రుషులూ వచ్చి పూజించిన ఆ జ్యోతిర్లింగాన్ని చూడు.' అని భార్యతో చెపుతున్నాడు నా తమిళ మిత్రుడు.

రాష్ట్రమంత్రిగారు కుటుంబ సహితంగా వచ్చారు. అయన కోసం ప్రత్యేక అభిషేకం... అక్కడ మా పర్యాటకులంతా అగిపోయారు.

నా ముందు శాంతారెడ్డి. ఆమె ముందు ఆ తాతగారు, ఆ పిల్లవాడు...

శివుడు అభిషేక ప్రియుడంటారు.

అభిషేకం జరుగుతున్నది. మంత్రోచ్చారణ సాగుతున్నది.

ఆ పిల్లవాడు 'దేవుడేడి తాతయ్యా' 'దేవుడేడి తాతయ్యా?' అని అడుగుతున్నాడు. నా కవి మెదటిసారిగా ఆ పిల్లవాడి నోట వినిపించిన మాటలు.

దేవాలయ పరిమళాలు ఆ చుట్టూ. నా ముందే శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునుడు. శాంతారెడ్డి ఆ పిల్లవాడి ప్రశ్న విని, వాడినే చూస్తున్నది.

'అదుగో ఆ కింద. నల్లగా, నీళ్లు పోస్తున్నారు చూడు. చేతులు పెట్టి ముట్టుకుంటున్నారు చూడూ... అతడే దేముడు.'

'అమ్మేది తాతయ్యా?'

తాతయ్య ఏమి చెప్పాడో, ఒక్కసారి పెద్దపెట్టున ఏడవటం మొదలు పెట్టాడు ఆ పిల్లవాడు. దేవుడే ఒక అబద్ధమన్నట్టు ఆ ఏడుపు ఆ గర్భగుడిలో మార్మోగిపోయింది.

ఇప్పుడు శాంతారెడ్డి కళ్లల్లోంచి నీళ్లు రాలుతున్నాయి.

* * *

వార్షిక సాహిత్య సంచిక *94*
ఇండియాటుడే